అభివృద్ధి వద్దు.. సీఎం రేవంత్ అసలే వద్దు

- మా భూముల జోలికొస్తే ఊరుకోం
- ఫార్మా విలేజ్‌కు భూములివ్వం
- దుద్యాల తహసీల్ ఎదుట భూబాధితుల ధర్నా

దుద్యాల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఫార్మా భూ బాధిత రైతులు

కొడంగల్, నవంబర్ 7: 'మాకు అభివృద్ధి వద్దు.. ఈ సీఎం రేవంత్‌రెడ్డి అసలే వద్దు.. మా భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదు. ఎన్ని మీటింగ్‌లు పెట్టినా బహిష్కరిస్తాం' అని వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండల ఫార్మా భూబాధిత రైతులు స్పష్టం చేశారు. ఈ మేరకు వారు దుద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. 'మాకు అభివృద్ధి వద్దు, సీఎం వద్దు.. మా భూములే మాకు ముద్దు' అంటూ రైతులు ముక్త కంఠంతో నినదించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీకి భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. అధికారులు తమ భూములు స్వాధీనం చేసుకునేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేసినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం ఎటువంటి సంక్షేమ పథకాలు అందించకపోయినా పర్వాలేదు.. కానీ భూములను మాత్రం వదులుకునేది లేదని అన్నారు. గ్రామాల్లో కాకుండా దుద్యాలలో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతులను అక్కడికే రావాలనే పిలుస్తున్నారని, అధికారులు తీరు మార్చుకోకపోతే చావోరేవో తేల్చుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఈ నిరసనలో దుద్యాల, లగచెర్ల, హకీంపేట, రోటిబండతండా, పులిచెర్లకుంటతండా ఫార్మా భూబాధితులు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్సిటీ స్థలం జోలికి రావద్దు: జేఏసీ

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్థలం జోలికి రావద్దని వర్సిటీ ఉద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. వర్సిటీకి చెందిన పదెకరాల భూమిని జేఎన్‌ఎఫ్ఏయూకు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వొద్దని కోరింది. ఈ మేరకు భోజన విరామం సమయంలో యూనివర్సిటీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనివర్సిటీ ఉద్యోగ జేఏసీ ప్రొఫెసర్ పల్లవి కాబ్డే, కన్వీనర్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, జేఏసీ నేతలు యాకేశ్ దైద, ప్రేమ్‌కుమార్, రవీంద్రనాథ్ సోలమన్, ఎండీ హబీబుద్దీన్, రజనీకాంత్, షబ్బీర్, రాములు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కొట్టాడని దళితుడి ఆత్మహత్య

- ఫోన్ పోయిందని ఫిర్యాదు చేయడానికొస్తే దాడి
- అవమాన భారంతో సజీవ దహనం చేసుకున్న దళితుడు
- అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ ఎదుట బాధిత కుటుంబం నిరసన

మెదక్ జిల్లా అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, మృతుడు కిషన్ (ఫైల్)

అల్లాదుర్గం, నవంబర్ 7: న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన తనకు జరిగిన అన్యాయాన్ని భరించలేక పెట్రోల్ పోసుకుని సజీవ దహనం చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం రాంపూర్‌లో చోటుచేసుకుంది. రాంపూర్ గ్రామానికి చెందిన కిషన్ (32) తన ఫోన్ పోయిందని మంగళవారం ఫిర్యాదు చేయడానికి అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఆ సమయంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సాయిలు తనను కొట్టి పంపించాడని, పీఎస్‌కు వెళ్తే తనకు న్యాయం జరగలేదని, సత్యం చచ్చిపోయిందని, ఎస్సై ప్రవీణ్‌రెడ్డికి సెల్యూట్ అంటూ సూసైడ్ నోట్ రాసి బుధవారం రాత్రి రాంపూర్‌లోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే కిషన్‌ను జోగిపేట దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్సకు సంగారెడ్డి దవాఖానకు తరలించగా అక్కడ మృతిచెందాడు. సూసైడ్ నోట్ చూసిన కుటుంబ సభ్యులు గురువారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. పరిస్థితిని గమనించిన సీఐ రేణుకారెడ్డి, ఎస్సై ప్రవీణ్‌రెడ్డి పోస్టుమార్టం నుంచి వచ్చిన శవాన్ని నేరుగా రాంపూర్‌కు తరలించారు. డీఎస్పీ ప్రసన్న కుమార్ హామీతో ఆందోళన విరమించారు.

రాహుల్.. ముందు ఇంటిని మార్చుకో

- సీడబ్ల్యూసీలోనే కొరవడిన సమతూకం
- కాంగ్రెస్‌కు సామాజిక సమతూకం పట్టదా?
- మాజీ మంత్రి పొన్నాల సూటి ప్రశ్న

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఇంట గెలిచి రచ్చ గెలవాలని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ముందు తన పార్టీ నిర్మాణంలో సామాజిక సమతూకం పాటించి ఆ తర్వాతే ఇతరులకు సుద్దులు చెప్పాలని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ కులగణన విషయంలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. సామాజిక సమన్యాయం వంటి విషయాలు కాంగ్రెస్ పార్టీకి పట్టవా అని ప్రశ్నించారు. ఆ పార్టీకి సీడబ్ల్యూసీ అత్యున్నతమైనదని, అందులో ప్రస్తుతం 39 మంది సభ్యులుంటే.. కేవలం ముగ్గురే ఓబీసీలు ఉండటం దేనికి సంకేతమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి పీసీసీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించినట్టే కల్పించి ఆ తర్వాత ఏంచేశారో అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఆ 39 మందిలో సోనియాగాంధీ సహా మహిళలు ఆరుగురే ఉన్నారని పేర్కొన్నారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా మల్లికార్జున్ ఖర్గేను చేశామని గొప్పలు చెప్పుకుంటున్నా, ఆ పార్టీ ఆయా వర్గాలకు వాస్తవమేమిటో తెలుసని పేర్కొన్నారు. పొన్నాల లక్ష్మయ్య చెప్పిన వివరాల ప్రకారం.. సీడబ్ల్యూసీలో సామాజిక వర్గాల సమతూకం ఇలా ఉన్నది.

సీడబ్ల్యూసీలో సామాజిక సమతూకం ఇలా

సామాజికవర్గం	సంఖ్య
ఓసీ	23
ఎస్సీ	5
ఎస్టీ	2
ఓబీసీ	3
మైనారిటీ	6

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని నిలదీస్తున్న మత్స్యకారులు

మక్తల్ ఎమ్మెల్యేకు నిరసన సెగ

- చేపలు పట్టనిస్తలేరని నిర్వాసితుల నిలదీత
- సర్కార్ పొట్ట కొడుతున్నదని మండిపాటు

మక్తల్, నవంబర్ 7 : నారాయణపేట జిల్లా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ముంపు గ్రామాల ప్రజల నుంచి నిరసన సెగ తగిలింది. మక్తల్ మండలంలోని సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లలో గురువారం ఉచిత చేపపిల్లలను ఎమ్మెల్యే వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పలువురు నిలదీశారు. చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సంగంబండ)లో సర్వస్వం కోల్పోయి ముంపునకు గురైన సంగంబండ, కొత్త గార్లపల్లి గ్రామాలకు చెందిన 110 కుటుంబాలను చేపలు పట్టనీయకుండా రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏండ్లుగా రిజర్వాయర్‌లో చేపలు పడుతున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తమ పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. తమ బతుకులకు అడ్డు రావొద్దని సూచించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ 110 కుటుంబాల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పీజీ కళాశాల ఎదుట విద్యార్థుల ధర్నా


జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పీజీ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు కళాశాల ఎదుట బైఠాయించారు. అధిక కోర్సులు ఉన్నా.. హాస్టల్ వసతి లేదని, రవాణా సౌకర్యం కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు పేర్కొన్నారు. - గద్వాల టౌన్

గంభీరావుపేటలో ట్యాంకర్‌తో నీటి సరఫరా

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని రెండో వార్డు ప్రజలు తాగు నీటి కోసం తండ్లాడుతున్నారు. ఈ వార్డుకు తాగునీరు అందించే బోర్ మోటర్ చెడిపోయి మూడు నెలలు దాటింది. దీంతో గురువారం గ్రామ పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ ద్వారా ఇంటింటికీ డ్రమ్ము నీటిని అందించారు. అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని, బోరు మోటర్‌కు మరమ్మతులు చేసి తాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. - గంభీరావుపేట

సుంకాలపై డీఆర్ఐ అధికారాల పునరుద్ధరణ

న్యూఢిల్లీ: కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ ఏవైనా వస్తువుల దిగుమతికి అనుమతి ఇచ్చిన తర్వాత, ఆ వస్తువులపై సుంకాలను చెల్లించాలని కోరుతూ షోకాజ్ నోటీసులు ఇచ్చే అధికారం డీఆర్ఐ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్) అధికారులకు ఉందని సుప్రీంకోర్టు గురువారం తీర్పు చెప్పింది. కస్టమ్స్ చట్టం, 1962లోని సెక్షన్ 28 ప్రకారం షోకాజ్ నోటీసులు ఇవ్వడానికి డీఆర్ఐ అధికారులు ''తగిన అధికారులు కాదు'' అని 2021లో అప్పటి సీజేఐ జస్టిస్ ఎస్ఏ బాబ్డే సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. ఈ తీర్పును సమీక్షించాలని కస్టమ్స్ శాఖ రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసింది. దీనిపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపి, 2021నాటి తీర్పును తోసిపుచ్చింది. ఈ చట్టం ప్రకారం షోకాజ్ నోటీసులను జారీ చేసి, సుంకాలను రాబట్టే అధికారం డీఆర్ఐ అధికారులకు ఉందని స్పష్టం చేసింది. అనేక కంపెనీలు సుంకాలను చెల్లించకుండా బాకీ పెడుతున్న నేపథ్యంలో ఈ తీర్పు డీఆర్ఐకి గొప్ప బలాన్ని ఇచ్చింది.

సర్వేపై సందేహాలెన్నో!

మొదటిపేజీ తరువాయి...

ప్రామాణికంగా తీసుకొని వేటికి కోత విధిస్తారోనని జంకుతున్నారు. ప్రస్తుతానికి ఇంటింటికీ స్టిక్కర్ల పంపిణీ చివరి దశలో ఉన్న దరిమిలా రేపటి నుంచి సర్వే ఎలా జరగనున్నదనేది ఆసక్తికరంగా మారింది.రంగారెడ్డి జిల్లాలో 6.57 లక్షల కుటుంబాలను సర్వే చేయటానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సర్వే కోసం 5,344 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. ఒక్కొక్క ఎన్యూమరేటర్‌కు 175 ఇండ్ల చొప్పున కేటాయించారు. ఆయా వార్డులకు కేటాయించిన ఎన్యూమరేటర్లు కుటుంబాల నుంచి సమగ్ర సర్వే చేయనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ఇచ్చిన సర్వే ఫాంలో ఉన్న అన్ని ప్రశ్నలకు కుటుంబ యాజమాని నుంచి సమాచారం సేకరించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సర్వే ప్రారంభించనున్నారు. సర్వేలో ఆధార్‌కార్డు అతి ముఖ్యం కానున్నది. ఆధార్‌కార్డు ఆధారంగా భూములు, బ్యాంకు లావాదేవీలు, భూముల పాస్‌బుక్కులు, అన్నీ అనుసంధానమై ఉన్నాయి. దీంతో సర్వేతో తమకు లాభమా? నష్టమా? అనే విషయంలో ప్రజలు ఒక నిర్ధారణకు రాలేకపోతున్నారు. ఈ క్రమంలో సర్వేపై ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పథకాలపైనే ప్రధాన భయం

ఇప్పటికే లక్షలాది మంది వివిధ రకాల ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులుగా ఉన్నారు. లక్షల మంది వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో సర్వే ద్వారా ప్రభుత్వం ఆర్థిక వివరాలూ సేకరిస్తున్నది. ఆయా కుటుంబాలకు ఉన్న వ్యవసాయ భూములు, బ్యాంకు అకౌంట్ల నెంబర్లు.. కీలకమైన వివరాలను తీసుకుంటున్నారు. దీంతో మున్ముందు అర్హతా ప్రమాణాల్లో మార్పులు చేస్తే ఈ వివరాల ద్వారా ఇప్పటికే పథకాలు వర్తిస్తున్న వారు తమకు ఏమైనా కోత పడనున్నదా? ఇక ముందు వచ్చే వాటికి వీటిని ప్రామాణికంగా తీసుకుంటారా? ఉన్న రేషన్‌కార్డు ఊడుతుందా? లేనివారికి కొత్తది వస్తదా? రాదా? ఇలా ఒకటేమిటి! అన్ని కోణాల్లోనూ ప్రజలు తమ సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.

ఒంటి గంట నుంచి సర్వే..

గ్రామీణ ప్రాంతాల్లో వరి కోతలు, పత్తి ఏరటం వంటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ప్రజలు, రైతులు ఉదయాన్నే పొలాల్లోకి వెళతారు. సర్వే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలుకానుంది. దీంతో ఆ సమయంలో జనం వ్యవసాయ పనులు, ఇతరత్రా కూలీ, ఉపాధి పనులకు వెళతారు. పిల్లలు ఉంటే వాళ్లు పాఠశాలలు, కాలేజీలకు పోతారు. మరి ఇండ్లల్లో ఎవరూలేని సమయంలో ఎన్యూమరేటర్లు వస్తే డోర్ లాక్ ఉంటుంది. ఈ క్రమంలో తిరిగి ఎన్యూమరేట్లు వస్తారా? అని అనేక మంది ఆరా తీస్తున్నారు. మరోవైపు ప్రజలు వ్యవసాయ, ఉపాధి పనులకు వెళ్లిన సమయంలో సర్వే చేయనుండటంతో ఇది తమకూ ఇబ్బందికరమైన పరిస్థితేనని ఎన్యూమరేటర్లు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్‌లోని శ్రీరాంనగర్ పరిధిలో రోడ్డుపై దర్శనమిచ్చిన కుల సర్వే పత్రం

రేపటి నుంచి అసలు సర్వే

- సీఎస్ శాంతి కుమారి

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటింటి వివరాలను సేకరించి స్టిక్కరింగ్ చేసే ప్రక్రియ శుక్రవారంతో పూర్తవుతుందని, 9వ తేదీ నుంచి అసలు సర్వే మొదలవుతుందని సీఎస్ శాంతికుమారి పేర్కొన్నారు. సర్వే నిర్వహణపై గురువారం ప్రత్యేకాధికారులతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయి లో పర్యటించి సర్వే జరుగుతున్న విధానా న్ని ప్రత్యక్షంగా పరిశీలించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

జనగణనలో కులగణన చేపట్టాలి

- పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య

హైదరాబాద్, నవంబర్7 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న జనగణనలోనే కులగణనను చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అమలు తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. రాజ్యాధికారంలో వాటా పంచకుండా బీసీలకు ఇంకా ఎన్ని రోజులు అన్యాయం చేస్తారని కృష్ణయ్య నిలదీశారు. జనాభా లెక్కల్లో బీసీ కులాల లెక్కలు సేకరించాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాహుల్ చెప్పేదొకటి.. రేవంత్ చేసేదొకటి!

- బ్యూరోక్రటిక్ సర్వేతో నిష్ప్రయోజమన్న రాహుల్
- బీసీ సంఘాలు, కులాలు, పౌరుల ప్రశ్నలకు పాతర
- ఏకపక్షంగా అధికారగణం ప్రశ్నావళితోనే ముందుకు..
- ఇండ్ల గుర్తింపుపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకత

హైదరాబాద్, నవంబర్7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ లోక్‌సభా పక్ష నేత రాహుల్‌గాంధీ ప్రవచిస్తున్నది ఒకటి. రాష్ట్రంలో కాంగ్రెస్ శాసనసభా నాయకుడు, సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్నది మరొకటి. ప్రజా కులగణన నిర్వహించాలని రాహుల్‌గాంధీ మొత్తుకుంటుంటే, అందుకు పూర్తిభిన్నంగా బ్యూరోక్రటిక్ కులగణనను నిర్వహిస్తున్నది రాష్ట్ర ప్రభుత్వం. ఇప్పుడిదే బీసీ వర్గాల్లో, రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధినేత చెబుతున్న దానికి విరుద్ధంగా రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఇంటింటి సర్వేను ఆదినుంచీ ముందుకు తీసుకెళ్లడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత సర్వే ప్రామాణికతపైనా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్ర స్థాయిలో సర్వే కోసం ఇండ్లకు స్టిక్కరింగ్ చేయడాన్నే పలువురు వ్యతిరేకిస్తున్నారంటే వివరాలు ఎలా ఇస్తారు? సేకరించే డేటాకు కచ్చితత్వం ఎలా ఉంటుందని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొత్తంగా సర్వే ఉద్దేశం నెరవేరుతుందా? అనే అనుమానాలను తెలంగాణ సమాజం లేవనెత్తుతున్నది.

రాహుల్ మాటకు విరుద్ధంగా..

కులగణన అంశంపై ప్రజాసంఘాలు, కుల సంఘాలు, సామాజికవేత్తల అభిప్రాయాలను తెలుసుకునేందుకు కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత రాహుల్‌గాంధీ ఇటీవల హడావుడిగా రాష్ట్రానికి వచ్చారు. మేధావివర్గం, ప్రజాసంఘాలు, కులసంఘాల నేతలతో ప్రత్యేకంగా భేటీ అయి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కులగణన ఏ రీతిలో ఉండాలి? ఏ విధానాలను అవలంబించాలి? ఏ పద్ధతిలో సర్వే నిర్వహించాలనే అంశాలపై చాలా స్పష్టంగా నొక్కిచెప్పారు. అధికారయంత్రాంగం తీర్చిదిద్దిన ప్రశ్నావళితో, నియమ నిబంధనలతో కులసర్వేను నిర్వహించవద్దని నొక్కిచెప్పారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రశ్నలు రూపొందించి, అవసరమైతే వారి నుంచే ప్రశ్నావళిని స్వీకరించి ప్రజాకులగణనను నిర్వహించాలని ఘంటాపథంగా తెలిపారు. రేవంత్‌రెడ్డి సర్కారు మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కు బాధ్యతలను అప్పగించడమేగాక, ఆ విభాగం రూపొందించిన ప్రశ్నావళితోనే సర్వేకు సిద్ధమైందని సామాజికవేత్తలు మండిపడుతున్నారు.

ప్రజాభిప్రాయాలకు విలువేది..?

ఇంటింటి సర్వేకు ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన ప్రశ్నావళిపై కుల సంఘాలు, కార్మిక సంఘాలు అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతీయులను ఒకే కులస్తులుగా పరిగణించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం డిమాండ్ చేస్తున్నది. ఎన్యూమరేషన్ ఫార్మాట్‌లో విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మలను కులంగా కాకుండా వృత్తులుగా పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సంప్రదాయ వృత్తులైన కమ్మరం, వడ్రంగం, ఇత్తడి, శిల్పి, స్వర్ణకార వృత్తులను నిర్వహిస్తున్న వారందరినీ విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ జాతీయులుగానే గుర్తించాల్సి ఉన్నా, సర్వే ప్రశ్నావళిలో పంచవృత్తులకు బదులుగా కేవలం కమ్మరం, వడ్రంగి, స్వర్ణకార వృత్తులనే కులాలుగా ముద్రించడాన్ని ఆక్షేపించింది. ఇప్పటికైనా సవరించాలని ఆ సంఘం డిమాండ్ చేస్తున్నది. సర్వేకు సంబంధించి తెలంగాణ గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ యూనియన్ కూడా పలు సూచనలు ముందుపెట్టింది. 'రోజువారీ వేతన కార్మికులు' అనే కోడ్ శీర్షికను 'అసంఘటిత విభాగం కార్మికులు/వేతన కార్మికులు'గా మార్చాలని, అనధికార ఉద్యోగుల విస్తృత స్వరూపాన్ని అర్థం చేసుకోవడంలో ఉపయోగపడుతుందని తెలుపుతున్నది. 'అసంఘటిత విభాగం కార్మికులు/వేతన కార్మికులు'గా కోడ్4లోనే వర్గీకరించాలని డిమాండ్ చేస్తున్నది. అలాగే వ్యక్తిగత వివరాలు, ఇంటి నిర్మాణ స్థలం, ఇంట్లో ఉన్న గదుల సంఖ్యను కూడా అడగడంపై జనం ఆక్షేపిస్తున్నారు. ఇంట్లో దంపతులు తీసుకున్న రుణాల వివరాలపైనా సర్వే ప్రశ్నావళిలో వేర్వేరుగా ఉన్నది. అత్యవసర పరిస్థితులు, సందర్భాలను బట్టి రుణాలు తీసుకుంటారు.. కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత సంబంధాల ఆధారంగా కాగితాలు లేకుండానే రుణాలు పొందుతారు.. దీనిపై కచ్చితత్వం ఎలా ఉంటుందని అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఇవేగాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల సంఘాలు సైతం ఆమోదయోగ్యమైన, అర్థవంతమైన, సహేతుకమైన అనేక సూచనలను ప్రభుత్వం ముందు పెట్టాయి. అయినప్పటికీ ఇటు ప్రభుత్వం, అటు ప్లానింగ్‌బోర్డు ఏమాత్రం పట్టించుకోకుండా సర్వేను ముందుకు తీసుకెళ్లడంపై మేధావి వర్గం నిప్పులు చెరుగుతున్నది.

మధ్యాహ్న భోజనం ఇంటి నుంచే..

- గిట్టుబాటు కావడం లేదని చేతులెత్తేసిన నిర్వాహకులు
- ఈ ఏడాది ప్రారంభం నుంచి అందని భోజనం
- ఇదీ మెదక్ జిల్లా నాగసానిపల్లి ప్రైమరీ స్కూల్ తీరు

కౌడిపల్లి, నవంబర్ 7: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం నాగసానిపల్లి ప్రాథమిక పాఠశాలలో గత ఐదు నెలలుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదు. ఇక్కడ ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు మొత్తం 54 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి మధ్యాహ్న భోజనం అందడం లేదు. గిట్టుబాటు కావడం లేదని మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు వంట చేయడం ఆపేశారు. అప్పటి నుంచి గ్రామంలో పలువురితో చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోయింది. చేసేదేమీ లేక విద్యార్థులు ఇంటి నుంచే లంచ్ బాక్సులు తెచ్చుకొని తింటున్నారు. అక్షయపాత్ర ద్వారా అందించాలని తీర్మానం చేసినా ఫలితం లేకపోయింది. ఎంఈవో బాలరాజును వివరణ కోరగా.. ఈ సమస్య ఇప్పటిది కాదని, ఈ ఏడాది స్కూల్ ప్రారంభమైనప్పటి నుంచి ఉన్నదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మెదక్ జిల్లా నాగసానిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న లంచ్ బాక్సులను చూపుతున్న విద్యార్థులు

శ్రీకాళహస్తిలో అఘోరి కలకలం

- ఆత్మార్పణకు ప్రయత్నం

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తేతెలంగాణ): కొద్దిరోజులుగా తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన అఘో రి శ్రీకాళహస్తిలో ఆత్మార్పణకుయ త్నించడం కలకలం రేపింది. ఏపీలోని శైవాలయాల సందర్శనలో భాగంగా గురువారం ఆమె తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తికి వచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు వెళ్తుండగా దుస్తు లు ధరించి రావాలని ఆలయ సిబ్బంది సూచించారు. దీంతో వారి మధ్య వా గ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే అఘోరి తన కారులో ఉన్న పె ట్రోల్ క్యాన్ తీసుకొని ఆత్మార్పణకు యత్నించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న మహిళా పోలీసులు, స్థానికులు మహిళలు ఆమెకు నచ్చజెప్పి వస్త్రాలు కట్టారు. అఘోరిని కేవలం వస్త్రధారణతో మాత్రమే దైవదర్శనం చేసుకోవాలని కోరామని ఆలయ సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు. తనతో వారు దురుసుగా ప్రవర్తించారని అఘోరి ఆరోపించారు. ఇటీవల హైదరాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆత్మార్పణ చేసుకుంటానని ప్రకటించగా, పోలీసులు ఆమెను అడ్డుకొని రాష్ట్ర సరిహద్దులు దాటించారు.

స్టాల్స్ తొలగించడంతో ఆందోళన చేస్తున్న నిర్వాహకులు

కుమారి ఆంటీకో న్యాయం? మాకో న్యాయమా?

- నాలెడ్జ్ సిటీ స్ట్రీట్ వెండర్స్ ఆందోళన
- స్టాల్స్ తొలగింపుపై మండిపాటు
- స్వరాష్ట్రంలో బతికే పరిస్థితి లేదని నిర్వాహకుల ఆగ్రహం

కొండాపూర్, నవంబర్ 7: ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకుంటున్న కుమారి ఆంటీకో న్యాయం..అదే స్ట్రీట్లపై వ్యాపారం చేసుకునే మాకో న్యాయమా? అంటూ నాలెడ్జ్ సిటీలోని స్ట్రీట్ వెండర్స్ ప్రశ్నించారు. సమాచారం లేకుండా టీఎస్ఐఐఎస్, ట్రాఫిక్ పోలీసులు దౌర్జన్యంగా తమ స్టాల్స్ తొలగించారని గురువారం ఆందోళన చేపట్టారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించకుండా, సాఫ్ట్‌వేర్ సంస్థలకు దూరంగా బతుకుదెరువు కోసం చిరు వ్యాపారం చేసుకునే తమపై దౌర్జన్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలిగేలా, కనీసం అంబులెన్స్ సైతం వెళ్లలేని పరిస్థితిని కల్పిస్తున్న కుమారి ఆంటీ స్టాల్స్ వైపు కన్నెత్తి చూడని అధికారులు, తమపై ఇలా చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఫుట్‌పాత్ స్టాల్స్ వైపు వెళ్లొద్దని, వ్యాపారాలకు ఇబ్బందులు కలిగించొద్దని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినా టీజీఐఐఎస్ అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్టాల్స్ నడుపుతున్న వారిని పట్టించుకోని అధికారులు, స్థానికులమైన తాము నడుపుతున్న స్టాల్స్ తొలగించడం వెనక కారణాలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత రాష్ట్రంలో బతికే పరిస్థితి లేకుండా అధికారులు నడుచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు 40 స్టాల్స్ తొలగించడంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న 100 కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు.